


నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

రైతు, కార్మికుల ఐక్య కార్యాచరణ పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బంటు దాసు కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పంటకు మద్దతు ధర ఇవ్వాలని, కార్మిక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. విద్యుత్తు సంస్కరణ చట్టాలను, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పాత బస్టాండ్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ధర్నా చేపడుతున్నామని తెలిపారు.

మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట

మంత్రి సంధ్యారాణి



జెండా ఊపి ధాన్యం రవాణా వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

వైసిపి ప్రభుత్వ హయాంలో ధాన్యాన్ని కొన్ని మిల్లులకే తరలించడం, తక్కువ ధరకు కొనుగోలు చేయడం ద్వారా రైతులను దోపిడీ చేశారని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ప్రస్తుతం అలాంటి మిల్లర్ల దోపిడీకి ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందన్నారు. సోమవారం మండలంలోని శివరాంపురంలో పిఎసిఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తెచ్చి మద్దతు ధరను పొందాలని తెలిపారు. గోనె సంచులు, హమాలీ ఖర్చులు, మిల్లు వరకు తీసుకెళ్లే రవాణా ఛార్జీలను కూడా ప్రభుత్వమే రైతులకు అందజేస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, ఎ.ఎ అనురాధ పండా, తెలుగు రైతు నాయకులు బి.తవుడు, భాస్కరరావు, బాలాజీ, కృష్ణ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం : ఎమ్మెల్యే

సీతానగరం : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. సోమవారం మండలంలోని పెదబోగిలి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారుల బారినపడి మోసపోవద్దన్నారు. రైతులకు ప్రభుత్వం ఉచితంగా గోనె సంచుల సరఫరా చేస్తుందని, లేబర్ ఛార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను అనుసరించి రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తారని, జిల్లా అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని చెప్పారు. ధాన్యం మద్దతుధర క్వింటాకు ఎ-గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకం రూ.2,300 చెలిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం కిరణ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్, టిడిపి నాయకులు సాల హరగోపాల్, దామినేని భాను ప్రసాద్, పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, కె.అరవింద్ కుమార్, సబ్బాన శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసరావు, ఇజ్జాడ రాంబాబు, సత్తెన్న, తెంటు వెంకటఅప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆదుకుంటామని.. రోడ్డున పడేస్తారా?

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వామపక్షాల మద్దతు

ప్రజాశక్తి-పార్వతీపురం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, మేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడేమో వారిని రోడ్డున పడేస్తారా? అని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కూరంగి మన్మథరావు.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి వేణు, కూరంగి మన్మథరావు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జోనల్ పోస్టులు డిఎస్‌సిలో ఎలా కలిపారని ప్రశ్నించారు. డిఎస్‌సి నుంచి గిరిజన గురుకుల బోధన పోస్టులు మినహాయించాలని డిమాండ్ చేశారు. పోరాటానికి అండగా ఉంటామని వారికి భరోసానిచ్చారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల, అధ్యాపకులకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వాకాడ ఇందిర, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి సోమేష్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, నాయకులు చెల్లూరు సీతారాం, ట్రైబల్ రైట్స్ ఫోరం నాయకుల లొబ్బ లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.గోపినాయుడు, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు అరిక చంద్రశేఖర్, కోలక గౌరమ్మ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు పి.సంఘం తదితరులు మద్దతు తెలిపారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

అనంతరం ధర్నా వద్దకు వచ్చిన గ్రీవెన్స్ నిర్వాహకులు, డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలియజేశారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయ, అధ్యాపక సంఘం జిల్లా నాయకులు దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. సమస్యను సావధానంగా విని, సమస్యను బట్టి 48 గంటల్లోగా పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. పరిష్కారం కాని సమస్యలకు, అందుకు గల సరైన కారణాలను అర్జీదారులకు వివరించాలని ఆదేశించారు. మళ్లీ ఫిర్యాదులు పునఃప్రారంభం అయ్యే అవకాశానికి తావివ్వరాదని కలెక్టర్ తేల్చిచెప్పారు. ప్రతి జిల్లా అధికారి పిజిఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టంచేశారు.

పిజిఆర్ఎస్‌కు 104 వినతులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు 104 వినతులు అందాయి. సోమవారం కలెక్టరేట్‌కు వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విని, తదుపరి చర్యలు కోసం సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వికలాంగుల వద్దకు వెళ్లి, అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుమలనాయుడు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఎపిడి వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ, ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు మంజూరు చేయాలి

సాలూరు, గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోస్టులు మంజూరు చేసి, వారిని కొనసాగిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. పోస్టులు మంజూరు లేక, సమయానికి జీతం అందక ఇబ్బందులు, ఆందోళన చెందుతున్నారని రంజిత్ కుమార్ తెలిపారు. వీరి సేవలను నీతి అయోగ్ సభ్యులు, గవర్నర్ ప్రశంసించారని గుర్తుచేశారు. ఐదేళ్లుగా పని చేస్తున్న వారికి కనీస ఉద్యోగ భద్రత లేదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శాంతి, సుధ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై ఫిర్యాదు

పార్వతీపురం రూరల్ : చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బలగ శంకర్రావు.. గ్రీవెన్స్‌లో వినతి అందించారు. తాజా కొత్తవలసలోని సర్వే నంబరు 137లోని 8.77 ఎకరాల విస్తీర్ణం కలిగిన తమ్మినాయుడు చెరువు కబ్జాకు గురవుతోందని తెలిపారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని కోరారు.


డ్వామా పీడీకి వినతి అందిస్తున్న నాయకులు

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అంబులెన్స్ సౌకర్యం కొనసాగించాలి

జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్‌కి రావడానికి అంబులెన్స్ సేవలు కొనసాగించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, శ్రామిక మహిళా సంఘం నాయకులు ఇందిర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, కిడ్నీ రోగులు.. కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతి అందించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఈ నెల 8వ తేది నుంచి అంబులెన్స్ సేవలను నిలిపేశారని వారు తెలిపారు. దీనివల్ల వారు సమయానికి డయాలసిస్ చేయించకుంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని, ఆటోలో రావడం వల్ల కుటుంబంపై ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. వెంటనే అంబులెన్స్ సేవలను పునరుద్ధరించాలని కోరారు.

సిఎం దృష్టికి పాలకొండ సమస్యలు

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే జయకృష్ణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల అసెంబ్లీలో తోటపల్లి ప్రాజెక్టు సమస్యతోపాటు, పట్టణంలో డంపింగ్ యార్డ్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే జయకృష్ణ.. వాటిని వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.


సిఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఎమ్మెల్యేకు సన్మానం

అంచనాల కమిటీ సభ్యులుగా ఇటీవల నియమించిన స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణను సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంచనాల కమిటీ లో తనను నియమించటం చాలా సంతృప్తి ఇచ్చిందన్నారు. ఈ పదవితో ప్రభుత్వం తనమీద మరింత భాధ్యత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గండి రామినాయుడు, సింగన్నవలస సర్పంచ్ చెబోదుల లక్ష్మీనారాయణ, వాటపాగు సర్పంచ్ వావిలాపల్లి రాజారావు ఉన్నారు.

కూలీలతో వెళ్తున్న వ్యాను బోల్తా

ఒకరు మృతి.. 8 మందికి గాయాలు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

వరి కోతలకు ఒడిశా నుంచి ఆంధ్రాకు వ్యవసాయ కూలీలను తీసుకెళ్తున్న బొలెరో వ్యాను కుంబీమడకు సమీపంలోని ఘాట్ రోడ్డులో సోమవారం బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. 8 మందికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశాలోని కోన గ్రామానికి చెందిన కూలీలు విజయవాడ ప్రాంతానికి వరికోతలకు బొలెరో వ్యానులో బయల్దేరారు. సాలూరు వరకు వ్యానులో వచ్చి, అక్కడి నుంచి విజయవాడ తరలించేందుకు సాలూరులో బస్సు సిద్ధం చేశారు. ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద గ్రామమైన కుంబీమడకు రెండు కిలోమీటర్ల దూరంలోని ఘాట్‌రోడ్డులో వ్యాను బోల్తా పడింది. దీంతో సుబిత (22) పొట్టంగి ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ ఆమె మరణించింది. కుమారి పరిస్థితి విషమంగా ఉంది.


బోల్తా పడిన వ్యాను వద్ద క్షతగాత్రులు

రావాడ రామభద్రపురం ఆస్పత్రిలో
పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి


రోగితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని రావాడ రామభద్రపురం పిహెచ్‌సిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని కోరారు. రావాడ రామభద్రపురం పిహెచ్‌సిని సోమవారం సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గంగునాయుడు, కోరంగి సీతారాం, గోరపాడు సోమయ్య, బలరాం, సుబ్బారావు, బొంకయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సిలో గిరిజనులకు, రోగులకు సరైన సౌకర్యాలు అందడం లేదన్నారు. సిబ్బంది పూర్తిస్థాయిలో ఎప్పుడూ ఉండటం లేదని చెప్పారు. ప్రతిరోజూ కనీసం 50 మంది వరకు రోగులు వస్తుంటారని, వీరికి వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. వైద్యాధికారి ఉదయం వచ్చి మధ్యాహ్నం వెళ్లిపోతున్నారని చెప్పారు. మలేరియా, డయేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి జ్వరాలకు పూర్తిస్థాయిలో మందులు ఆస్పత్రిలో ఉంచడం లేదని చెప్పారు.

దీనివల్ల రోగులు ప్రయివేటు మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే జిల్లాలో వైద్యం అందక 12 మంది విద్యార్థులు మరణించారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పిహెచ్‌సిలో సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలని డిమాండ్‌చేశారు.

మంత్రుల వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

వాలంటీర్లపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి డోలా వీరాంజనేయులు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సిపిఐ నాయకులు ఆర్‌విఎస్ కుమార్ డిమాండ్‌చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పొంతన లేని ప్రకటనలు చేసి వాలంటీర్ల మనోభావాలతో ఆడుకుంటున్నారా? అని ప్రశ్నించారు. వాలంటీర్లకు ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు సింహాద్రి దుర్గారావు, వార్డు, గ్రామ సచివాలయాల వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.అశోక్, జిల్లా నాయకులు పి.కుమార్, బి.రామకృష్ణ, ఎం.శ్రావణి, బి.క్రాంతికుమార్, బి.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

మహిళలకు చైతన్యం అవసరం

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ • డిఆర్‌డిఎ ఆధ్వర్యాన ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

మహిళలపై లైంగిక వేధింపులు, గృహ హింస, బాలికలపై అకృత్యాలను అరికట్టేందుకు అవగాహన, చైతన్యం అవసరమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంపై ప్రచార ర్యాలీ చేపట్టారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కార్యక్రమంపై పోస్టర్లను ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జరగనుందని తెలిపారు. గృహ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం 2005, మహిళలు, బాలికల అనైతిక రవాణా చట్టం, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం వంటి చాలా చట్టాలు ఉన్నాయన్నారు. వీటిపై అవగాహన, చైతన్యం పెంపొందించి తద్వారా మహిళలు, బాలికలపై హింసను నిరోధించడం ఈ ప్రచార లక్ష్యమని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి ఎం.ఎన్.రాణి, డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యం నాయుడు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.తిరుమల నాయుడు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం : వెలుగు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల అధికారులు, విఒఎలు సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పైడితల్లి, ఎపిఎం శ్రీరాములు మాట్లాడారు.



సీతానగరంలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, విఒఎలు



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు ఇందిర

మహిళలపై దాడులను ఆపాలి

పార్వతీపురం : మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను ఆపాలని ఐద్వా జిల్లా నాయకులు ఆర్.ఇందిర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అంతర్జాతీయ మహిళ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎస్‌సి సంక్షేమ వసతిగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, సొంత ఇంట్లోనే వారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళలపై చిన్నచూపు ఈనాటికీ కొనసాగుతోందన్నారు. మహిళల రక్షణకు టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శించారు. నేడు మహిళలు అన్ని విషయాల్లో ముందుకు వెళ్తున్నారని, పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చెప్పారు.

పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషి మాట్లాడుతూ మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులతో దగ్గరగా ఉండొద్దని కోరారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు కంగారు పడకుండా సమస్యను ఎలా ఎదుర్కోవాలనే ఆలోచన చేయాలని సూచించారు. వార్డెన్ పూర్ణమ్మ మాట్లాడుతూ అబ్బాయిలతో చనువుగా ఉండొద్దని, చదువుపైన శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, పట్టణ కార్యదర్శి కె.డేవిడ్, నాయకులు ఎం.శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



విచారణ చేస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ వేగవంతం

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

బోగస్ ఎస్‌టి కుల ధ్రువపత్రాలకు సంబంధించిన విచారణను వేగవంతం చేస్తామని సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం బోగస్ ఎస్‌టి ధ్రువపత్రాలకు సంబంధించిన విచారణను నిర్వహించారు. ఈ సందర్భంగా 3 కేసులను విచారించారు. కేసులకు సంబంధించి ఇరువురి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.చినబాబు, డిడి ఎం.అన్నదొర, సూపరింటెండెంట్ కె.దేశ్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తిపార్వతీపురం రూరల్



మాట్లాడుతున్న ఎఎస్‌పి దిలీప్‌కుమార్

కేసుల విచారణలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ఎఎస్‌పి ఒ.దిలీప్ కుమార్ అన్నారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో జిల్లాలో ఎంపిక చేసిన కొంతమంది పోలీసు సిబ్బందికి ఎఎస్‌పి అంకిత సురాణాతో కలిసి డ్రోన్ కెమెరా వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం ద్వారా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ప్రాంతాలపై, అక్రమ రావాణాపై, గంజాయి రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యాధికారి హేమాక్షి

ఆయుష్ వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి-సీతానగరం

ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాధులు, మధుమేహం నియంత్రణపై ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి తెలిపారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పి.పావని ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు సోమవారం ఆయుష్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో హేమాక్షి మాట్లాడుతూ ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానం ద్వారా అనేక దీర్ఘకాలిక రుగ్మతలను తగ్గించవచ్చని తెలిపారు. ఇందుకు అనేక ఆయుర్వేద ఔషదాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యవతి, భవాని, శర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కళాకారుడు ఈశ్వరరావును సత్కరిస్తున్న శిష్టకరణ సంఘం సభ్యులు

కళాకారునికి సత్కారం

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని తుమరాడ గ్రామానికి చెందిన కళాకారుడు చాకరాపల్లి ఈశ్వరరావుకు శిష్టకరణ సంఘం సభ్యులు సోమ వారం సత్కరించారు. ఈశ్వరరావు పాఠశాలల్లో 400పైగా ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు టి.నాగేశ్వరరావు, బుచ్చిబాబు, ఉమామహేశ్వరరావు, జగదీశ్వరరావు, రమణమూర్తి, ధర్మారావు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని జాతీయస్థాయిలో ప్రచారం జరుగుతున్న సందర్భంలో సోమవారం జియ్యమ్మవలసలో మండల సమైక్య అధ్యక్షురాలు పల్లె రాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎంపిడిఒ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. మహిళలు, విఒఎలు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రమేష్, ఎంపిపి బొంగు సురేష్, ఎపిఎం కేతిరెడ్డి త్రినాథమ్మ, తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రకరకాల మోసాలతో నేరగాళ్లు ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ల వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. ఫోన్ కాల్స్ ద్వారా ఒటిపి నంబరు అడిగి, మీకు బ్యాంకు నుండి కాల్ చేస్తున్నామని నేరగాళ్లు ప్రజలను మభ్యపెట్టి మోసాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రమేష్, ఎంపిపి బొంగు సురేష్ మహిళలు పాల్గొన్నారు.

నేడు వికలాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-పాచిపెంట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం వికలాంగులకు ఉపకరణాలను అందజేసేందుకు గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బివిజె పాత్రో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని వికలాంగులు, సీనియర్ సిటిజన్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





సీతానగరం, మక్కువలో వినతులు స్వీకరిస్తున్న ఎంపిడిఒలు త్రివిక్రమరావు, స్వరూపరాణి

మండల స్థాయి గ్రీవెన్స్‌కు ఆదరణ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండల స్థాయిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు ప్రజల నుంచి ఆదరణ లభించింది. పార్వతీపురం ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ కె.రూపేష్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీతోపాటు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం పలు గ్రామాల నుంచి దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సంతోషికుమారి, హెచ్‌డిటి కిరీటి, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు ఫిర్యాదులు అందాయని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు తెలిపారు. ఆ వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపామని చెప్పారు.

అధికారుల డుమ్మా

వీరఘట్టం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఎంఇఒ, పంచాయత్ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్, వెలుగు, ఉపాధి శాఖల అధికారులు తప్ప మిగిలిన విభాగాల అధికారులు హాజరు కాలేదు.

మక్కువ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు నాలుగు వినతులు వచ్చినట్లు ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు. ఇందులో తూరుమామిడి ఆర్‌ఎస్‌కెకు సంబంధించి సిమెంట్ బస్తాలపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు అందింది.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 58 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట



వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ చినబాబు

సీతంపేట ఐటిడిఎలో ఎపిఒ జి.చినబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 వినతులు వచ్చాయి. వాటిలో కొన్ని..

- భామిని మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన కాగితాపల్లి రామ్మూర్తి తమ పొలానికి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు.
- సీతంపేట మండలం చిన్నబగ్గ కాలనీకి చెందిన ఎన్.శంకర్రావు కిరాణా షాప్ లోను మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు.
- బూర్జమానుగూడ గ్రామస్తులు అడ్డంగి రెవెన్యూ పరిధిలోని కొండపోడు భూములకు డికెటి పట్టాలు ఇప్పించాలని విన్నవించారు.
- భామిని మండలం బిల్లమడ గ్రామానికి చెందిన పసుపురెడ్డి కవిత ఆశావర్కర్ ఉద్యోగం ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు.
- పాలిష్‌కోట గ్రామానికి చెందిన బిడ్డిక స్వప్న పవర్ టిల్లర్ మంజూరు చేయాలని వినతి అందజేశారు
- బూర్జ మండలం బొడ్లపాడు గ్రామానికి చెందిన నిమ్మక వెంకటరావు తమ గ్రామానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు.
- సీతంపేట మండలం రోలుగుడ్డి గ్రామానికి చెందిన కుండంగి త్రినాథరావు తమ గ్రామానికి అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.
- కారిగూడ గ్రామానికి చెందిన ఆరిక సన్యాసి.. సిసి రోడ్డుకు రక్షణగోడ నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు.
- జల్లార గ్రామానికి చెందిన మండంగి దిబ్బయ్య తమ గ్రామంలో రోడ్లు నిర్మించాలని విన్నవించారు.

ఈ కార్యక్రమంలో ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్‌ఒ గణేష్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, సిడిపిఒ రంగలక్ష్మి, డిప్యూటీ డిఇఒ నారాయుడు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా పారమ్మ కొండ



శివలింగం వద్ద పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి దంపతులు

ప్రజాశక్తి-పాచిపెంట

పారమ్మ కొండను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానని

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దచీపురువలస సమీపంలోని పారమ్మకొండ వద్ద నిర్వహించిన శివపార్వతుల కళ్యాణంలో మంత్రి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులతోపాటు కొండపైకి మెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. ముందుగా సుబ్రహ్మణ్యస్వామి, మహాశక్తి శ్రీచక్రం, శివలింగానికి అభిషేక పూజలు నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కళ్యాణం

పారమ్మ కొండ వద్ద సోమవారం శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కళ్యాణానికి వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. సాలూరు పట్టణానికి చెందిన కూనిశెట్టి భీమారావు, బోను సత్యనారాయణ, ఎడ్ల సూరిబాబు కుటుంబాలు కళ్యాణం నిర్వహించాయి. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

ఎస్‌టి కొత్తవలస గిరిజనులను ఆదుకోండి

ప్రజాశక్తి-సాలూరు

విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం రాజుల రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని ఎస్‌టి కొత్తవలస గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణిని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. సోమవారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో గిరిజనులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి వివరాలు అందజేశారు. గిరిజనులు 15 ఏళ్ల క్రితం వలస వచ్చి కొండ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. నేటికీ గిరిజనులకు కనీస మౌలిక సదుపాయాలు లేవని, బతకడానికి వారు పడుతున్న తిప్పలు చూస్తే బాధ కలుగుతుందని చెప్పారు. బొబ్బిలి అటవీశాఖ అధికారులు.. గిరిజనులను వెంటనే గుడిసెలు ఖాళీ చెయ్యాలని బెదిరించి నోటీసులు ఇచ్చారని తెలిపారు.

మంత్రికి వినతి

అటవీశాఖ అధికారుల వల్ల గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌తో మాట్లాడి గిరిజనులంతా ఒకేచోట నివాసం ఉంటామంటే ప్రభుత్వం వెంటనే వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఇళ్ల స్థలాలు ఇస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇప్పలవలస గోపాలరావు, తాడేపల్లి నాగేశ్వరరావు, తుమ్మగంటి రామ్మోహన్, సహాయ స్ఫూర్తి అధ్యక్షులు సాయికుమార్, అమ్మా సేవా సంఘం అధ్యక్షులు సురేష్, గిరిజన ప్రతినిధులు వంతల సుర్లు, సీదరపు భాస్కర్, మర్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డును చూపిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

నో హెల్మెట్.. నో ఎంట్రీ

ప్రజాశక్తి-సీతంపేట

పర్యాటక ప్రాంతమైన అడలి వ్యూ పాయింట్‌కు వెళ్లే పర్యాటకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీతంపేట ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. హెల్మెట్ ధరించకుంటే ప్రవేశం లేదని స్పష్టంచేశారు. ఈ మేరకు అడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో సోమవారం ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. కిట్టలపాడు, శంభాం, కుసిమి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. త్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ సి గురుమూర్తి, పోలీసులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలలో రావాడ రామభద్రపురం పిహెచ్‌సి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.శృతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పి ప్రత్యూష, ఎఎన్‌ఎంలు పద్మ, నిర్మల, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శృతి

పార్వతీపురంలో అగ్ని ప్రమాదం

రూ.14 లక్షలు ఆస్తినష్టం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

పార్వతీ పురం పట్టణంలో సోమవారం తెల్లవారు జామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు 14 లక్షల ఆస్తినష్టం సంభవించింది. బైపాస్ రోడ్డులో శివాలయం పక్కన ఉన్న టైర్స్, ఆటోమొబైల్ షాపులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ప్రమాద స్థలానికి చేరుకొని, ఘటనపై బాధితులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వ పరంగా సహకారం అందించడానికి కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు.

బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో ఎవరైనా బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు ఒక ప్రకటన తెలిపారు. పట్టణాన్ని స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ నిషేధిత చర్యలు చేపట్టామని వివరించారు.



ప్రకృతి సేద్య కూరగాయల విక్రయాలను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

కిచెన్ గార్డెన్‌కు కషాయాలు పంపిణీ

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంటలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్‌కు కషాయాలను మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అందజేశారు. కషాయాల పిచికారీ ద్వారా పురుగులు, తెగుళ్లు రాకుండా ఉంటాయని ఆయన తెలిపారు. పంటకు కావలసిన పోషకాలు కూడా అందుతాయని చెప్పారు. అనంతరం ప్రకృతి సేద్య కూరగాయల స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిఆర్‌పి కర్రి శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఎస్‌పి మాధవ్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై అలసత్వం వద్దని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి.. పోలీసు అధికారులను హెచ్చరించారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై అర్జీలందాయి. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్‌పి ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఎర్రన్నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమించిన స్థలంలో ఏర్పాటు చేసిన అద్దె షాపులు

ఆక్రమించి అద్దెకు ఇస్తున్నారు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్న స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి ఇతరులకు అద్దెకు ఇస్తున్నారు. జిల్లా ఆసుపత్రికి ఎదురుగా ఉన్న వెటర్నటీ ఆసుపత్రి, న్యాయమూర్తుల బంగ్లా స్థలంలో, ప్రధాన రహదారిని అనుకుని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నారు. ఆసుపత్రి ప్రహరీ నిర్మించాల్సిన స్థలాన్ని కొందరు ఆక్రమించారు. ప్రధాన రహదారి దాటి షెడ్లు వేశారు. ఆ షెడ్లను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులకు అద్దెలకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ షాపులకు వచ్చిన కొనుగోలుదారులు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం ఆ మార్గంలో అధికారులు రాకపోకలు సాగిస్తున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. వెంటనే ఆక్రమణలు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పలువురు కోరుతున్నారు.



న్యూ కాలనీలో మురుగుతో నిండి ఉన్న గుంతల్లో పందులు

కాలువ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - కురుపాం

కాలువ నిర్మించి మురుగు సమస్యను పరిష్కరించాలని కురుపాంలోని న్యూకాలనీ వాసులు అధికారులను వేడుకొంటున్నారు. కాలనీ వెనక ప్రాంతంలో కెజిబివి ఉంది. అక్కడి విద్యార్థుల వాడుకనీరు, వంటల వ్యర్థాలు న్యూకాలనీ వెనుక చేరుతున్నాయి. గుంతల్లో ఆ మురుగునీరు నిల్వ ఉండటంతో పందులకు స్థావరంగా మారింది. తీవ్ర దుర్గంధం వస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కాలువ నిర్మించి, మురుగునీరు వెళ్లేందుకు మార్గం సుగమమం చేయాలని న్యూ కాలనీవాసులు కోరుతున్నారు.

పెదపెంకిలో ఎస్‌డిపి

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకి గ్రామంలో పిహెచ్‌సి వైద్యాధికారి కిరణ్మయి ఆధ్వర్యాన ఎస్‌డిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి వ్యాధులపై, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలోని పైలేరియా వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

కొండచిలువ హతం

ప్రజాశక్తి-సీతానగరం

లక్ష్మీపురం, కామన్నదొరవలస మధ్యలో ఉన్న చెరకు తోటలో సోమవారం కొండచిలువను గ్రామస్తులు హతమార్చారు. పొలం పనులకు వచ్చిన రైతులు చెరకు తోటలో ఉన్న కొండచిలువను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే తేరుకుని దాన్ని హతమార్చారు.